# పెళ్ళిపిలుపు

గోవిందరాజు సీతాదేవి

శరత్ శ్రీకాంత్ నవల చదువుతూ కాలాన్నీ పరిసరాలనీ మర్చిపోయిననాకు 'పోస్ట్' అన్న కేక ఆలశ్యంగా విన్పించింది. పుస్తకం మూసి లేచి బైటకి వచ్చేసరికి ఓ కవరూ మరో శుభలేఖా వరండాలోకి విసిరి పోస్టుమేను పక్కవాళ్ళింట్లోకి వెళ్ళటం కన్పించింది. వంగి రెండూ తీసుకుని చూశాను. రెండింటిమీద దస్తూరీ అన్నయ్యదే. ఆతురతగా శుభలేఖ తీసి చూశాను. వధువు చి॥ సౌ॥ సుశీల, వరుడు చి॥ సోమసుంద్రరావు. కింద అన్నయ్యా వదినల పేర్లు. అన్నయ్య నాలుగో కూతురి పెళ్ళికి పిలుపు అన్నమాట. క్షణం మనస్సు ఆనందంతో స్పందించింది. సుశీల బీకాం పాస్అయి నాలుగేళ్ళు దాటింది. యిటు వుద్యోగంకోసం అటు వరుడికోసమూ చూస్తూన్నాడు అన్నయ్య. రెండింటిలో ఒక్కటీ కుదరలేదుగానీ సుశీలకి పాతికేళ్ళు దాటాయి.

అన్నయ్య పాతకాలంవాడు. యెవరు యెంత చెప్పినా విన్పించుకోకుండా నలుగురు ఆడపిల్లలకి తండ్రి అయ్యాడు. 'నారుపోసిన దేవుడు నీరుపోయడా' అన్న మూఢనమ్మకం అన్నయ్యది. ఓ కంపెనీలో అతిసామాన్యమైన వుద్యోగం చేస్తూనే పైముగ్గురు ఆడపిల్లలకీ పెళ్ళిళ్ళు చేసేశాడు. కానీ నాలుగో అమ్మాయి పెళ్ళి విషయం వచ్చేసరికి ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే వుంది. ఆపైన సమాజంలో మార్పులూ అతివేగంగా మారిపోతున్నాయి. కాలేజీ చదువు వుంటే దాన్ని చూసైనా యెవరన్నా త్వరగా ముందుకు వస్తారు అన్న ఆశతో సుశీల చదువు అయి డిగ్రీ తీసుకునేవరకూ నిమ్మకి నీరెత్తినట్లు వున్నాడు. ఆ తర్వాత ప్రయత్నిస్తే ఒక్కటీ కల్సిరాలేదు.

ప్రతి వుత్తరంలోనూ యేదో సంబంధం చూశాననీ సుశీలని చూసి వెళ్ళారనీ బహుశా యీ సంబంధం అవవచ్చుననీ యిలా అయితే త్వరలో లగ్నం పెట్టుకుని నీకు పెళ్ళిపిలుపు పంపిస్తాననీ రాసేవాడు. అలా రాస్తూ పెళ్ళికి నాలుగురోజులు ముందే మీ దంపతులు యిద్దరూ వచ్చి మాకు ఆసరాగా నిలవాలని మరీమరీ రాసేవాడు.

'అలాగే వస్తాం. నీ పిలుపుకోసం యెదురు చూస్తూన్నాం' అని జవాబు రాసేది తను.


అన్నయ్య సంబరపడిపోతూ జవాబు రాసేవాడు.

"నీవు వచ్చి మా పక్కన నిలిస్తే చాలా ధైర్యంగా వుంటుందమ్మా. పెళ్ళివారికి యే లోపమూ జరక్కుండా చూసుకుంటావు కనుక నాకు నిశ్చింత. సుశీలని చూసి వెళ్ళినవాళ్ళు మరో పదిరోజుల్లో యే సంగతీ తెలియజేస్తాం అన్నారు. కనుక ఎలానూ యిది కుదిరేలావుందని మీ వదినని మెల్లగా పెళ్ళిపని ఒక్కొక్కటీ మొదలుపెట్టుకో అని చెప్పాను. త్వరలోనే నీకు రాస్తాను. యిలా వుండేవి అన్నయ్య ఉత్తరాలు. అలా రాసిన వుత్తరం తర్వాత మరో నెలవరకూ జాబుకోసం చూసేదాన్ని. కానీ వచ్చేదికాదు. ఆ తర్వాత వచ్చిన జాబులో మరో సంబంధం వివరాలు వుండేవి.

'యిదైనా కుదిరితే బాగుండు' అనుకునే దాన్ని. అన్నయ్య వుత్తరం కోసం చూసే దాన్ని. పోస్ట్‌మేన్ వచ్చేవాడు. యేవో వుత్తరాలు యిచ్చేవాడు. కానీ అది నే యెదురుచూసే

పెళ్ళిపిలుపు మాత్రం కాదు. పిల్లలు ప్రతిరోజూ స్కూలునించి రాగానే 'అమ్మా మామయ్య వుత్తరం రాశాడా! మనం పెళ్ళికి వెడుతున్నామా' యిలా లక్ష ప్రశ్నలువేసి వేధించేవాళ్ళు. వీళ్ళ ప్రశ్నలు విసుగు కలిగిస్తూన్నా సహనం తెచ్చుకుంటూ చెప్పేదాన్ని. 'వస్తుంది. తప్పక వస్తుంది వదిన పెళ్ళిపిలుపు! ఆ పిలుపు వస్తే నేనే చెప్తాను. మీరు అడగవద్దు' అన్నాను. నా అకారణ కోపానికి విస్తుపోతూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని 'సరేలే' అన్నట్లు చూసి పుస్తకాల సంచీలు ఓ పక్కనవిసిరి టిఫినుతిని ఆటలకి పరుగెత్తేవాళ్లు శశీ నీరజా. వీళ్ళిద్దరూ యింకా హైస్కూల్లోకే రాలేదు. యెప్పటికి పెద్దవాళ్ళుకాను. చదువులు యెప్పటికి పూర్తికాను. యిదే ఆలోచిస్తూ వుండేదాన్ని. వీళ్ళ పెళ్ళికి యిప్పుడు అన్నయ్య పడే అశాంతి నేనూ పడాలా! యిలా అనుకున్నప్పుడు మాత్రం భయం భయంగా అనిపిస్తుంది. శ్రీవారికి ఆలోచనలు రావు. నేచెప్పినా ఆయన అంతా విని తేలిగ్గా నవ్వేస్తారు—

"నీ ముఖం పదిహేనుయేళ్ళ తర్వాత సమాజంలో యెన్ని మార్పులు వస్తాయో!" అని. సమాజంలో యెన్ని కొత్తమార్పులైనా రావచ్చు. కానీ ఆడపిల్ల పెళ్లి తలిదండ్రులకి అగ్నిపరీక్షలా కాకుండా, తేలిగ్గా అయ్యేంత మంచిమార్పు వస్తుందన్న నమ్మకం నాకు లేదు. ఆ సూచనలు కనుచూపుమేర కన్పించటం లేదు అన్పిస్తూంది నాకు.



సుశీలకి పెళ్ళి ఖాయం కావటం లేదని అన్నయ్యా వదినా దిగులు పెట్టుకున్నారు. వచ్చి చూసిన ప్రతివరుడూ 'కట్నం చాలద'నో 'వుద్యోగంలేని చదువువల్ల ప్రయోజనం ఏం వుంది' అనో 'అమ్మాయి రంగు చామనఛాయ అనో' 'యాక్టివ్‌గా లేదు అనో' యిలా చాలా రకాల మాటలు అని వెనక్కి వెళ్ళిన

వీరుల సంఖ్య చూసి సుశీల తనకీ జన్మలో పెళ్ళి కాదేమో అని దిగులుపడి ఆరోగ్యం పాడుచేసుకుని చిక్కి సగం అయింది. తన వ్యధ నంతా ఓసారి వుత్తరంలో నింపి నాకు పంపింది.

అత్తయ్యా

మరో పెళ్ళికొడుకు పత్తాలేకుండా పారి పోయాడు. నాకు యీ పెళ్ళిచూపులంటే విసు గొస్తోంది. ఇదివరలో నా వుద్యోగంకోసం నాన్న చేసిన ప్రయత్నం ఫలించి ఏ చిన్న వుద్యోగమన్నా వస్తే బాగుండు హాయిగా బ్రతకవచ్చు అని అన్పిస్తోంది.


అత్తయ్యా భగవంతుడు తప్ప మరే అండా లేని మాలాంటి వాళ్ళని యెందుకిలా పరీక్షిస్తా డాయన. ఈ జన్మలో నిన్ను మరేం కోరను, చిన్న వుద్యోగం వచ్చేలా చెయ్యి దేవుడా అని యెంత ప్రార్థిస్తూన్నా ఆ దేవుడికి కరుణ కలగటంలేదు. నా బాధని యెవరికి చెప్పుకోను. నిజం చెప్పాలంటే హైస్కూలు చదువులతో ఆపినా పెళ్ళి అంటూ అయింది కనుక అక్కయ్యలు ముగ్గురూ అదృష్టవంతులే అన్పి స్తుంది. చదువు కావాలి కావాలి అని ఆరాట పడి నిరంతర కృషిచేసి డిగ్రీ తెచ్చుకున్నాను. దీనివల్ల నాకు ఒరిగింది ఏమిటి. ఏ యస్సెల్సీ అబ్బాయినో చూసి తేలిగ్గా పెళ్ళిచేసి వదిలించు కునే అవకాశంకూడా నాన్నకు లేదు. డిగ్రీ లేకున్నా వుద్యోగంవుంటే చాలు నాన్నా. నాకేం అభ్యంతరంలేదు. ఆ సంబంధాలు అయినా సరే చూడు అని నాన్నకి చెప్పాను. ఆయనకి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి నా మాటలకి. అదీ చూశాను. వాళ్ళూ యెనిమిదీ పదీవేలు కట్నంగా కావాలని అంటూన్నారట. నాకింక పెళ్ళి యెలా అవుతుంది! నాన్నకి శాంతి యెప్పటికి లభిస్తుంది! అత్తయ్యా యింకా కొన్నాళ్ళిలాగే వుంటే పిచ్చిపడుతుందేమో అని భయంగా వుంది. నాయీ బాధని నీకు చెప్పటంలో వుద్దేశ్యం కాస్త బరువుతగ్గి శాంతి పడాలని మాత్రమే. అత్తయ్యా నన్ను అర్థం చేసుకుంటావు కదూ!

ఇలా రాసింది సుశీల. యీ వుత్తరాల్లోని అక్షరం అక్షరం నాకు గుర్తువుంది. సుశీలే కాదు ఆ వయస్సులో ఆ పరిస్థితిలోవున్న యే ఆడ పిల్ల ఆలోచనలైనా అలాగే వుండి తీరతాయి. యిందుకే సుశీలకి ధైర్యంచెప్తూ వెంటనే వుత్తరం రాశాను. నా వుత్తరం తనకి ధైర్యాన్ని ఓదార్పుని యిచ్చింది అంటూ జవాబు రాసింది. యిలా సుశీలకీ నాకూ వుత్తరప్రత్యుత్తరాలు జరుగుతూనే వున్నాయి. సుశీల మొదట మొదట కుటుంబ విషయాల తోనే వుత్తరాన్ని నింపేసేది. వాటికి జవాబు యివ్వకుండా నే చదివిన పుస్తకాల గురించీ వెళ్ళిన మీటింగ్స్ గురించీ ఆ మీటింగ్‌లో వక్తలు వెలిబుచ్చిన అభిప్రాయాల గురించీ సాంఘిక సమస్యల గురించీ రాస్తూ కొన్ని పుస్తకాల పేర్లు రాసి అవి లైబ్రరీలో దొరుకు తాయిగనుక తెప్పించుకుని చదివి వాటిని గురించి నీ అభిప్రాయం రాయమనీ రాశాను.

"అత్తయ్యా యీ సమయంలో ఆ పుస్త కాలు చదివినా నా తలలోకి యెక్కుతా యంటావా!" అని రాసింది.

"ఫర్లేదు. చదవటానికి ప్రయత్నించు" అని వెంటనే రాశాను. సుశీల వారానికి రెండు సార్లు రాసే వుత్తరాలు తగ్గి ఒకటి అయింది. ఆ ఒకదానిలో రాసినదైనా ఆలోచనల్లో కొత్త మార్పువచ్చినట్లు అన్పించింది. యిలా యిద్దరం స్నేహితుల్లా అయాం. మా యిద్దరి స్నేహా నికీ వయస్సు అడ్డంరాలేదు. సహజంగా స్నేహం అంటే సమవయస్కులకే పరిమితం. కానీ యీ అడ్డంకిని నేనే దాటుకుని సుశీలకి సన్నిహితంగా వెళ్ళానో లేక తనే వయస్సులో తేడా అనే అడ్డుగోడని పడగొట్టుకుని నా మనస్సులో ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చిందో! అని ఆలోచిస్తే యిప్పటికీ అంతు బట్టదు.

శ్రీవారితో యెప్పుడు షాపింగ్‌కి వెళ్ళినా అక్కడున్న సామానుని ఆసక్తిగా చూస్తాను. సుశీల పెళ్ళికి ప్రజెంటేషన్‌గా ఏది యిస్తే బాగుంటుందో అని. ఒకటి రెండు




చాలా నచ్చాయి కూడా. యిప్పుడే కొనేసి వుంచేస్తే! అన్న ఆలోచన వచ్చింది. శ్రీవారికి చెప్పాను. ఆయన నవ్వేశారు.

"ఇంకా పెళ్ళిపిలుపు రాందే! అప్పుడే తొందరేమిటోయ్" అన్నారు.

"ఆ పిలుపు వచ్చినప్పుడు నాకు నచ్చినవి లేకుంటే!"

శ్రీవారు నా ప్రశ్నకి క్షణం ఆలోచించారు.

"యింతకీ యిప్పుడు నువు కొనాలన్న వస్తువేది."

"అదిగో! బుద్ధదేవుడు ఓ శ్రీమంతురాలి యింటిముందు నిల్చుని 'భవతీ భిక్షాందేహి' అన్నట్లున్న నిర్మల్ పెయింటింగ్ భలేవుంది చూడండి" చేతిలోకి తీసుకుని చూపాను.

ఆయన ఆ చిత్రంలోకి తదేకంగా చూశారు. ఖరీదు అడిగి పాక్ చెయ్యమని చెప్పారు. నా సంతోషం చెప్పనలవికాదు. పాకెట్ తీసుకుని హుషారుగా యింటికి వచ్చాను. వచ్చిన వెంటనే బట్టలైనా మార్చుకోకుండా ఆయన, వరండాలోనించి లోపలికి వచ్చేచోట మేకు కొట్టి బుద్ధుడి ఫోటో తగిలిస్తూంటే చెప్పలేనంత కోపం వచ్చింది.

"యిదేం పని. మనకోసమా యిది కొన్నది. నేను ముందే చెప్పానుగా" గట్టిగా అన్నాను. ఆయన అదేం విన్పించుకునే స్థితిలో లేరు.

"అనూ యిలా యిక్కడికి వచ్చి చూడు. అరె. చూడు అంటే" అని రెక్క పట్టి లాగి మరీ చూపిస్తూ "అచ్చంగా అలనాటి సిద్ధార్థుడు నీయింటి ప్రాంగణంలో నిల్చి భిక్ష అడుగుతున్నాడా అన్న అనుభూతి కల్గటం లేదూ?"

ముఖం చిట్లించాను. కానీ శ్రీవారి మాటలు చెవులో ప్రతిధ్వనిస్తూన్నాయి. మనస్సులోని కోపం కరిగిపోతూవుంది. బుద్ధదేవుడు నా లాంటి అతిసామాన్యురాలి యింటిముందు నిల్చి 'భిక్ష' అడగటమా? ఒకవేళ అలా జరిగితే! అదెంత అదృష్టం యీ భావంతో మనస్సు పరవశించింది. యిది క్షణం మాత్రమే. నా మనస్సుమీద నాకే కోపం వచ్చింది. యీ వెధవ మనస్సు యెప్పుడూ

యింతే! జరగటం అసంభవం అని తెల్సినా అప్పుడప్పుడూ యిలా యేవేవో జరిగితే, యెంత బాగుండు! అన్పిస్తూ వుంటుంది. ఇదో బలహీనత కాబోలు అన్పించి అప్పటి కప్పుడే మనస్సుని కంట్రోల్‌లోకి తెచ్చేసు కున్నాను. "యీ ఫోటో గోడకి తగిలించినా రేపు అదే షాపుకు వెళ్ళి అలాంటిదే ఒకటి తెచ్చి సుశీలకోసం దాచివుంచుతాను' అన్నాను. శ్రీవారు చికాకుగా చూశారు. ఆ తర్వాత అన్నారు.

"అనూ అసలు యే సందర్భంలో యే ప్రజంటేషన్ యివ్వాలో నిర్ణయించటం కూడా ఒక 'ఆర్ట్' అంటాను. ఒక్కసారి ఆలో చించి చూడు. సుశీలకి పెళ్ళి అంటూ పిలుపు వచ్చిందే అనుకో యీ విరాగిగా మారిన బుద్ధదేవుడినా వధూవరులకి ప్రజంట్ చేయటం ఏం " రెట్టించిన తర్వాతగానీ శ్రీవారి అసలు అభిప్రాయం అర్థంకాలేదు. అరెరె నా నిర్ణయంలో పొరబాటు ఒప్పుకున్నాను. తర్వాత తననే అడిగాను. "సలహా చెప్పండి ఏం కొందాం?"

ఆయన నవ్వారు.

"ఎందుకు నవ్వుతూన్నారు" చిరుకోపంతో అడిగాను.

"ఆ పెళ్ళి పిలుపంటూ రానీ!" ఆలో చిద్దాం.

"కాదు. ముందే ఆలోచించి వుంచుకో వాలి."

"అయితే ఒక పని చెయ్యి. నీవు కొనా లనుకున్న వస్తువులు డైరీలో నోట్ చేసుకో. పెళ్ళి పిలుపు రాగానే ఆ లిస్ట్ ఓసారి చూసుకో. అప్పుడు యేది కొత్తగా తృప్తిగా అన్పిస్తే అది కొనేసెయ్, ఏం. సరేనా?"


'చాలాబాగుంది అయిడియా' అనుకుని అందమైన వస్తువులు కన్పించినప్పుడల్లా నోట్ చేసేస్తున్నాను. యీ లిస్టులో శరత్ సాహిత్యం సెట్‌నుంచి బుక్స్ పెట్టుకునే అద్దాల బీరువా రాధాకృష్ణుల నిర్మల్ పెయిం టింగ్ యిలా చాలా చోటుచేసుకున్నాయి. యెన్నో రోజులుగా యెదురుచూసిన సుశీల పెళ్ళిపిలుపు యివాళ రానే వచ్చింది. యింక ప్రయాణం ఏర్పాటు చూసుకోవాలి. డైరీచూసి శ్రీవారిని సంప్రదించి ప్రజంటేషన్ కొనేసే యాలి. అయిదారు సంవత్సరాలు అయింది ఆంధ్రదేశం చూసి. శ్రీవారి వుద్యోగరీత్యా దూరంగా వుండక తప్పలేదు. తెలుగుదేశం వెడతాం. కొన్నాళ్ళపాటు అక్కడ వుండి ఆత్మీయులనందరినీ చూస్తాను అన్న వూహ రాగానే మనస్సు సంతోషంతో గంతులు వేస్తోంది.

శ్రీవారు ఆఫీసునించీ పిల్లలు స్కూలు నించీ యెప్పుడు వస్తారా, యీ వార్త చెప్తానా అని యెదురు చూస్తూ వున్నాను. శ్రీకాంత్ నవల యిప్పటికి పదిహేనుసార్లు చదివినా మళ్ళీ చదివినా కొత్తగానే అన్పిస్తూంటుంది. మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకున్నాను కానీ మనస్సు నవలమీదకి వెళ్ళటంలేదు. అన్నయ్య వదినా సుశీలా దగ్గరకి యెగిరిపోతోంది.

* * *

"శలవు లేదు. పెళ్ళిటైముకి వస్తాను" అంటూ నన్నూ పిల్లలనిద్దరినీ రైలెక్కించారు శ్రీవారు. ఆనందంగా అన్నయ్య యింట్లో అడుగుపెడుతూండగా వదిన కాళ్ళు కడుక్కో మని నీళ్ళు తెచ్చింది. సుశీల పరుగున వచ్చి కౌగలించుకుంది. ఎండలో ఎక్కడికో వెళ్ళిన అన్నయ్య చెమటలు కక్కుతూ తిరిగి వచ్చాడు. అరవైయ్యేళ్ళు దాటిన అన్నయ్య వుద్యోగం నుంచి రిటైర్ అయినా బాధ్యతల నుంచి రిటైర్ కాలేదు. అన్నయ్యా వదినా యిప్పటికే అలసిపోయినట్లున్నారు. అన్నయ్య వాత్సల్యంగా పలకరించాడు. బావమరిది రాలేదేం అని అడిగాడు. పిల్లలని దగ్గరకు తీసుకున్నాడు. భోజనాలు అయిన తర్వాత తీరుబడిగా కూర్చుని కబుర్లు ప్రారంభించాం.

"అనూ! సుశీలకి పెళ్ళిసంబంధం ఖాయం కాలేదని ఆరాటపడ్డాను. అవదేమోనని భయ పడ్డాను. ఇప్పుడు కుదిరిన సంబంధం




మంచిదే. అబ్బాయి బాగున్నాడు. రైల్వేలో వుద్యోగం చేస్తున్నాడు. సుశీలకి యీడైన వాడు.'' తృప్తినిండిన ముఖంతో చెప్పింది వదిన.

''కట్నం యెంత'' కుతూహలంగా అడిగాను.

''ఎనిమిదివేల అయిదువందలు! ముందే యిచ్చేశాం. యిస్తేకాని కుదరదు అన్నారు.''

''ఏమిటీ యెనిమిదివేల అయిదువందలా! యింత డబ్బు యివ్వగల స్తోమతు అన్నయ్యకి యెక్కడినుంచి వచ్చింది!'' ఆశ్చర్యంగానే అడిగాను. అన్నయ్య బట్టతల సవరించుకుంటూ పేలవంగా నవ్వాడు.

''మన శక్తితో మగపెళ్ళివారికి పనియేం వుందమ్మా'' అన్నాడు. యింకేం మాట్లాడలేక పోయాను. శ్రీవారు రైలెక్కించి వెయ్యి రూపాయలు యిచ్చి మీ అన్నయ్యకి యివ్వు. పాపం రిటైర్ అయి యిబ్బందుల్లో వున్నాడు అన్నారు. అవి భద్రంగాతీసి అన్నయ్య చేతిలో పెట్టబోయాను.

''ఏమిటమ్మా అదీ'' అన్నాడు మొహమాటపడిపోతూ.

''చంద్రుడికో నూలుపోగు అన్నట్లు సుశీల పెళ్ళికి ఏ ఖర్చుకిందైనా వుంటుంది యిది తీసుకో అన్నయ్యా.''

అన్నయ్యా వదినల కళ్ళల్లో నీళ్ళు వుబికాయి.

''ఆడపిల్లవి. నీకు మేంపెట్టాలిగానీ నువ్వు యివ్వటం యేమిటి!'' వదిన వారించబోయింది.

''అలా అనకు. అసలు నాకేగనుక సుశీలకి యీడైన కొడుకు వుండివుంటే యిలా పరాయి సంబంధాలు వెతుక్కోనిచ్చేదాన్నా అనేసరికి అన్నయ్య చిన్నగా నవ్వేశాడు.

వందరూపాయిల పదినోట్లూ అన్నయ్య చేతికి బలవంతంగా యిచ్చాను. పెళ్ళి పనులు చాలావరకూ అయిపోయినాయి. మిగిలినవి చకచకా పూర్తిచేయించాను. సుశీలని పెళ్ళికూతుర్నిచేశాం. పెళ్ళికూతురు అలంకరణలో సుశీల అందంగా కన్పిస్తోంది. పెళ్ళికి బంధువులు అందరూ వచ్చారు. యిల్లంతా ఒకటే

ముఖభావాల్లో మనిషికీ జంతువులకూ
చాలా తేడాలున్నాయి!
బొమ్మలో చింపాంజీ
నవ్వుతూ కనిపిస్తోంది. నిజానికి
అది నవ్వుకాదు! ఏ వస్తువునైనా
పరికించి చూస్తున్నప్పుడు
చింపాంజీ ముఖభావన యీ విధంగా
వుంటుంది !!



(౭) చిత్ర విజ్ఞానం

సందడి. పెళ్ళిరోజు రానేవచ్చింది. మగపెళ్ళి వారూ వచ్చారు. పెళ్ళి పందిరిలో పీటలమీద పెళ్ళికొడుకు కూర్చున్నాడు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. సుశీల గౌరీపూజ చేస్తోంది. సన్నాయి మోగుతోంది. పెళ్ళివారికి కావలసిన సౌకర్యాలని చూస్తూ వూపిరిసల్పని పనిలో వుండికూడా శ్రీవారి రాకకోసం వెయ్యి కళ్ళతో యెదురుచూస్తూన్నాను. రైలు వచ్చే వేళ దాటిపోయింది. యింకా రాలేదేమిటీ! సెలవు దొరకలేదా! రైలు తప్పిపోయిందా! వుహూ. వస్తానంటే సమయానికి టంఛనుగా వచ్చితీర్తారు. వచ్చి కొత్త పెళ్ళికొడులా రీవిగా నిల్చుని——

“రైలు అర్ధగంట లేటోయ్!” అంటారు.

నా వూహే యిదంతా. నాలో నాకే నవ్వు వచ్చింది.

“అమ్మా నాన్నారొచ్చానేరూ ” అని పిల్లలకేక.

“అనూ అన్నయ్య పిలుస్తున్నాడు. పెళ్ళి కూతురిని మేనమామ పెళ్ళిపందిరిలోకి తీసుకు వెళ్ళాలట నువు దగ్గరుండవే.” యిలా అని మరోకేక. చేసేపని వదిలి త్వరగా సుశీల దగ్గరకి వెళ్ళాను. సుశీల పెళ్ళిపందిరిలో పీటల మీద కూర్చున్న తలిదండ్రుల మధ్యన కుడి కాలుపెట్టి కూర్చోబోయింది.

“ఆగండి ఆగండి యీ పెళ్ళి జరగటానికి వీల్లేదు.” అంటూ హడావుడిగా నలుగురు పెళ్ళిపందిరిలోకి వచ్చారు. ఓ యిరవై య్యేళ్ళ అమ్మాయీ ఆమె తల్లిదండ్రులూ అన్నగారు యిద్దరూ. సన్నాయి ఆగిపోయింది. పురోహితుడి మంత్రాలూ ఆగిపోయాయి. అంతవరకూ యెంతో సందడిగా వున్న పెళ్ళి పందిరి చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దంగా అయింది. కాసేపు బిగ్గరగా మాటలు కేకలు తిట్లు. పెళ్ళిపందిరిలో పెనుతుఫాను వీచినట్లు అయింది. అమ్మాయితో వచ్చిన అన్నగారు ఆవేశంగా పెళ్ళిపీటల దగ్గరకి వచ్చాడు. పెళ్ళికొడుకుని రెక్కపట్టుకుని లేవనెత్తి చెంపలు ఛెళ్ ఛెళ్ మనిపించాడు. అతనూ ఎదురు తిరిగాడు. యిదంతా యేమిటో అర్ధంకాక నిర్ఘాంతపోయిన కొందరు ఆ యిద్దరినీ విడిపించి అసలు విషయం చెప్పమన్నారు. వాళ్ళు చెప్పిన విషయం క్లుప్తంగా యిది.

ఈ పెళ్ళికొడుకు వుద్యోగరీత్యావున్న ఒక వూళ్ళో ఆ పిల్లని ప్రేమించానని వ్యవహారం నడిపి తలిదండ్రులకి తెల్సి పెళ్ళిచేసుకోమని బలవంతంచేస్తే వాళ్ళని తప్పించుకోలేక తనకి యెవరూ లేరని బొంకి రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుని కొన్నాళ్లు అత్తవారింట్లో యిల్లరికం అల్లుడిగా వుండి ఆపైన మరోవూరు ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడట. పెళ్ళాన్ని తీసుకువెళ్ళమని అంటే యిదిగో అదిగో అనేసి కాల


యాపన చేస్తూ యిక్కడ మళ్ళీ ఎనిమిదివేలు కట్నం పుచ్చుకుని పెళ్ళికొడుకై పీటలమీద కూర్చున్నాడు. అలా పెళ్ళి జరిగిందని స్వంత తలిదండ్రులకు కూడా తెలియదుట. యితను మరో పెళ్ళి చేసుకోబోతున్నాడన్న వార్త ఆలశ్యంగా తెల్సి పరుగున వచ్చారు వాళ్ళు. ఆ పిల్ల ధైర్యంగా పెళ్ళి చెయిపట్టుకుని గుంజి అడిగింది.

"ఎన్నిసార్లు పెళ్ళిచేసుకుంటావ్? నన్నేం చేస్తావ్?" అని. అతను తలవంచుకున్నాడు. యింక సాక్ష్యం ఏంకావాలి. అన్నయ్యా వదినా పీటలకి అతుక్కుపోయినట్లు కూర్చుండిపోయారు. సుశీలకి స్పృహ తప్పిపోయింది. నా పరిస్థితీ అలానే వుంది. కానీ నన్ను నేను సంబాళించుకుంటూ సుశీలని లోపలికి చేర్చాను. పెళ్ళిపందిరిలో గందరగోళం విని పిస్తోనే వుంది. శ్రీవారు అన్నయ్యవైపు నిల్చి మాట్లాడుతూన్నారు.

జరిగినదానికి మీ సంజాయిషీ యేమిటి? గద్దించి అడుగుతూన్నారు. పెళ్ళికొడుకు తండ్రికానీ తల్లికానీ మాట్లాడలేకపోతున్నారు. శ్రీవారికి ఆవేశం ముంచుకువచ్చింది. పెళ్ళికొడుకు దగ్గరగా నడిచారు. జుట్టుపట్టుకుని విసురుగా తలపైకి యెత్తారు.

"ఇవాళ యిందరిమధ్య యింత అవమానం భరించిన పెళ్ళికూతురూ ఆమె తల్లిదండ్రులూ నీకు యే శిక్ష విధిస్తే సరిపోతుంది? చెప్పు? నీ స్వార్థంతో అమాయకులైన వాళ్ళని మోసగించాలని చూడటం యెంతపెద్ద నేరం? చెప్పు. నీకు ఏ శిక్ష విధించాలి? ఏంచేసి ప్రతీకారం తీర్చుకోవాలి? చెప్పు. చదువుకున్న గాడిదా? నువ్వు చేసిన పనికి మగజాతికే తలవంపులు కల్గింది. వెళ్ళు పెళ్ళి సుశీల తలిదండ్రుల కాళ్ళు పట్టుకుని తప్పు అయిందని క్షమాపణ అడుగు." మెడపట్టి అన్నయ్య వైపుగా తోశారు.

అతను తప్పించుకు పారిపోవాలని చూస్తూన్నాడు. కానీ ధైర్యం చాలటంలేదు. అతని తండ్రి దగ్గరకి వచ్చి కొడుకుని పట్టుకుని



అన్నయ్య కాళ్ళదగ్గరకి తోస్తూంటే అన్నయ్య భరించలేకపోయాడు.

"చూడు శ్రీనాధ్! యితను యిలా క్షమాపణ అడిగినంత మాత్రాన పోయిన నా పరువు తిరిగిరాదు. దయచేసి వాళ్ళ నందర్నీ త్వరగా పంపేసెయ్యి." అంటూ మెల్లగాలేచి లోపలికి వెళ్ళిపోయాడు. శ్రీవారు యింకేం అనకుండా అందరినీ పంపేశారు.

పెళ్ళికొడుకు తండ్రి శ్రీవారి దగ్గరగా వచ్చి చేతులు పట్టుకున్నాడు.

"చూడు బాబూ! నువ్వు ఆయన బావ మరిదివిట కదూ! నే చెప్పేది కాస్త విను. వాళ్ళు యిచ్చిన కట్నం డబ్బు న్యాయంగా నే యిచ్చి వెళ్ళిపోవాలి. కానీ అది అంతా ఖర్చు అయిపోయింది. నేను త్వరలోనే ఆ పైకం పంపేలా చూస్తాను. యింకేం చెప్పలేను." ఆయన తలవంచుకుని వెళ్ళిపోయాడు. అర్ధ గంటలో కళకళలాడిన పెళ్ళిపందిరి ఖాళీ అయిపోయింది. స్పృహ తెల్సిన తర్వాత సుశీల కళ్ళనుంచి జలజలా కన్నీళ్ళు రాలాయి. దగ్గర కూర్చుని సముదాయించి ధైర్యం చెప్పాను.

"చూడమ్మా యిలాంటి పరిస్థితి యే ఆడ పిల్లకీ రాకూడనిది. దురదృష్టంవల్ల నీకు వచ్చింది. అయితే యిలాంటప్పుడు స్థైర్యంగా నిలబడగలగాలి. జీవితం అంటేనే సమస్యల మయం. దిగులుపడకు. శాంతంగా వుండటానికి ప్రయత్నించు. భగవంతుడు దయామయుడు. కనుకనే యీ పెళ్ళి కాకుండా తప్పించాడు. ఔనా! యిప్పుడు చెప్పు. ఎంత అదృష్టవంతురాలివో!"

సుశీలా అన్నయ్యా వదినా రెండు రోజుల తర్వాత కాస్త కోలుకున్నారు. శ్రీవారు ఎక్కడెక్కడో తిరిగి యెవరో స్నేహితులని కల్సుకుని సుశీలకి ఓ చిన్న వుద్యోగం తెప్పించారు. ప్రస్తుతం జీతం తక్కువే అయినా తర్వాత మరోటి చూసుకోవచ్చు అని తృప్తిపడింది సుశీల. శ్రీవారి సెలవు అయిపోవటంతో నేనూ పిల్లలూకూడా బయలుదేరక తప్పలేదు. సుశీల పెళ్ళికి ప్రజంట్ తెచ్చిన ప్యాకెట్ విప్పనేలేదు. అసలు ఏం తెచ్చారో చూడనే లేదు. పాకెట్ విప్పబోతూంటే వారించారు.

"సుశీలపెళ్ళి ఎన్ని సంవత్సరాలకి అయినా యిది అప్పుడే తెరవాలి. ఆ అమ్మాయికి యివ్వాలి."

"అలాగే. కానీ ఏమిటి తెచ్చారో చెప్ప కూడదూ!" అడిగాను.

"ఉహూ!" తల అడ్డంగా వూపి ప్యాకెట్ పెట్టె అడుగున పెట్టేశారు. సుశీల రైల్వే స్టేషనుకి వచ్చింది.

"అత్తయ్యా ! నేనింక పెళ్ళికోసం ఎదురు చూడను. యీ వుద్యోగం చేసుకుంటూ హాయిగా వుంటాను" అంది.

"అలా అనకు. జీవితంలో తిండీ బట్టా ఎంత అవసరమో అలానే పెళ్ళికూడా. అయితే నువ్వు యెదురు చూడకున్నా ఆ పెళ్ళి రోజనేది వచ్చితీరుతుంది. అప్పుడు నాకు పెళ్ళిపిలుపు అందుతుంది. ఆ పిలుపుకోసం నే యెన్నాళ్ళయినా యెదురుచూస్తూ వుంటాను" అంటూండగానే రైలు కదిలింది. కదిలే రైలు వెంట సుశీల నడుస్తూ వుంది.

"ఇంక యింటికి వెళ్ళమ్మా సుశీలా" అంటూన్నారు శ్రీవారు.

"అలాగే వుంటాను మామయ్యగారూ! అత్తయ్యా శశీ నీరజా వుంటాను." సుశీల వెనకబడిపోయింది. రైలు ముందుకు పరుగెత్తుతోంది. శ్రీవారు యేదో దీర్ఘంగా ఆలోచిస్తూన్నారు. నేనుమాత్రం మళ్ళీ సుశీల పెళ్ళి పిలుపుకోసం ఎదురు చూస్తూన్నాను. దేశంకాని దేశమే అయినా యిక్కడెవరన్నా ఓ పెళ్ళికొడుకు దొరికితే బాగుండు అన్పిస్తోంది. బహుశా శ్రీవారి ఆలోచనా యిదేనేమో! □